

# జాలిలేని జాబిలి

## – కొమ్మూరి వేణుగోపాలరావు



తనకు కావలసింది వెదుక్కుంటూ ముందుకుపోవడమే మానవుని జీవితం. కాని తనకు కావలసిందేమిటోకూడా తెలియని అస్పష్టస్థితి.

రచయిత కావాలనుకున్నాడు - అయినాడు. డాక్టరు కావాలనుకున్నాడు - అయినాడు. పేరు ప్రఖ్యాతులు కావాలనుకున్నాడు - లభించినై.

కానీ అతనికి యేదో కావాలి. అతన్నెంతోమంది ఆరాధించారు. జీవితంలోకి ఎందరో సుందరీమణులు ప్రవేశించారు. అతని చుట్టూ ప్రేమ హృదయంలో ప్రేమ. కాని ఆ ప్రేమ అతన్ని స్పర్శించేదేగాని అదృష్టవంతుడ్ని చేయలేదు.

యవనం వుంది - డబ్బు వుంది - కీర్తి వుంది - అంతా వున్నారు కాని...?

అతనిపట్ల జాబిలికి జాలిలేదు.

*కొమ్మూరి రవికిరణ్ గారి ప్రత్యేక అనుమతితో*
*అలనాటి అందమైన నవల పునర్ముద్రణ*

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**అనుకోకుండా ఎంతో** ఆప్యాయంగా మళ్ళీ జవాబు రాసేశాడు మధుబాబు. ఈసారి కాస్త పెద్దది రాశాడు. ఆమె బొత్తిగా అపరిచిత. తాను ఏం రాస్తే ఏం వొస్తుందో జాగ్రత్తగానే రాశాడు. స్వంత విషయాలు లేకుండా, అటు బొత్తిగా జనరల్ కాకుండా రాశాడు.

పద్మజ వెంటనే జవాబు రాసింది.

మధుబాబుకి యీ అనుభూతి కొత్తగావుంది. ఇదివరలో తనకెందరో రాశారు. ఇప్పటికీ రాస్తున్నారు. తాను వాటికి జవాబులు యిస్తూనేవున్నాడు. కానీ అవన్నీ సమస్యలమయం, చర్చలమయం. తాను వాళ్ళకు సన్నిహితంగా వచ్చినమాట వాస్తవమేగాని ఈ ఆకర్షణ, మధురయాతన ఆక్కడలేదు. ఒకరకంగా చాలా చిన్నపిల్లలా, అభమూ, శుభమూ తెలియని అమ్మాయిలా రాస్తోంది.

"అప్పుడే చెప్పులు తొడుక్కుని బయటకు పోదామనుకుంటున్నాను. ఇంతలో మీ ఉత్తరం వచ్చింది. ఎవరో నామీద బుట్టెడు పువ్వులు చల్లినట్లనిపించింది. మీ అక్షరాలు ఎంత అందంగా వుంటాయి? నా దస్తూరి బాగోలేదు కదూ" యిలా సాగింది ఉత్తరం.

మళ్ళీ జవాబు రాశాడు మధుబాబు.

రాసినప్పటినుంచీ ఆమె ప్రత్యుత్తరంకోసం ఎదురు చూడటం ఓ నూతన దినచర్య అయింది. అబ్బ! స్త్రీ ఎంత ఆకర్షణ?

## 20

ఎక్కడి మధుబాబు? ఎక్కడి పద్మజ? ఇద్దరూ ఒకరినొకరు చూసుకోలేదు. బహుశా మధుబాబు ఫొటో చూసి వుండవచ్చు పద్మజ. కాని ఓ మనిషి ఫోటోనుబట్టి రూపం మీద విశ్వసించటం కష్టం. మొత్తం మీద ఒకరికొకరు సన్నిహితంగా రాసాగారు.

ఆ ఉత్తరాలు చిత్రవిచిత్రంగా వుండేవి.

"పద్మా" అని సంభోదించేవాడామెను మధుబాబు. "పద్మా ఇక్కడ నాకేం తోచటంలేదు. ప్రపంచం మీద చిరాకు కలుగుతోంది. మీ కబుర్లు ఎంతసేపైనా వినాలని వుంది. మీరెందుకు అప్పుడప్పుడూ రాయటం ఆలస్యం చేస్తారు? ఎందుకో యీ సాహిత్య వ్యాసంగం మీద విరక్తి పుడుతోందండి నాకు. ఎందుకివన్నీ అర్థంలేకుండా అనిపిస్తోంది. మళ్ళీ విషాదం మీద మోజు. ఒక్కోసారి అర్ధరాత్రి లేచి కూర్చుని దేవదాసుల్ని, పార్వతుల్ని ఎడతెరిపి లేకుండా సృష్టించి యీ ప్రపంచాన్ని దుఃఖమయం చేయాలనిపిస్తుంది."

మధూ!

దేవదాసుల్ని, పార్వతుల్ని సృష్టించటం మీ అభిమతమైతే, అలాంటి యిన్స్పిరేషన్ మీకు ఇవ్వగలనన్న ధైర్యం నాకుంది. మీ కళ్ళలోకి చూస్తూ మీరు చెప్పే కబుర్లు నాకు వినాలనివుంది. ఎందుకో యివాళ ప్రొద్దున లేచినప్పటినుంచీ మీ గురించే ఆలోచిస్తున్నాను. మీ ఉత్తరం చదువుతూ ఏదో ఊహాలోకాల్లో విహరించసాగాను. ఇంతలో ఏదో చప్పుడై యీ లోకంలోకి వచ్చి చూసేసరికి ఏముంది? ఎర్రగా పండిన గోరింటాకు చేతిలో తెల్లటి మీ ఉత్తరం.

చాలా అల్లరి పిల్లకూడాను పద్మజ. ఒక్కోసారి ఎంతో అల్లరి చేసేది చిలిపి మాటలని కవ్వించేది. అతను ఊరుకునేవాడు కాదు. "అల్లరిపిల్ల పద్మజకు" అంటూ మొదలు పెట్టేవాడు. అనగా అనగా ఓ అబ్బాయికి అంటూ మొదలు పెట్టేది ఆమె.

మీ ఊరువొస్తే ఏం చేస్తారని అడిగేది.

"చెవి పట్టుకుని మా ఇంటికి లాక్కువెళతా" అన్నాడు.

"యెవరో యీ అమ్మాయి? అని మీ ఇంట్లో వాళ్ళు అడిగితే మీరు తెల్ల..వొద్దులెండి బాబూ మీకు కోపం వస్తుంది."

"మీరు రాయబోయి ఆపేసినట్లు తెల్లమొహం వెయ్యను. నా చెలికత్తె అని చెబుతాను."

"అన్నీ అబద్ధాలు."

"అదిగో మీరు నమ్మరు."

"మీ మొగవాళ్ళ మాటలు నేను నమ్మను."

"నాకు పరీక్షలు దగ్గరకొస్తున్నాయి బాబూ! నేను చదువుకోవాలి."

"ఎంత పరీక్షలయినా సరే, నాకు రాసి తీరాల్సిందే."

"మరి నా పరీక్షలు గల్లంతయిపోతేనో? ఈసారి పోయిందంటే ఇహ నేను మీకు కనబడను. ఎవ్వరికీ తెలియని, కనిపించని మారుమూలకు వెళ్ళిపోతాను."

"వొద్దు, అలా జరగదు. జరిగినా నా పిలుపు అందని దూరతీరాలకు వెళ్ళిపోవద్దు ప్లీజ్."

ఈ అమ్మాయి ఎలా వుంటుందని ఎప్పుడూ ఆలోచించలేదు. మధుబాబుకి అదే ఇంకెవరి గురించయినా అయితే అనుకోకుండానే ఓ రూపం కళ్ళముందు మెదులుతుంది. కాని పద్మజ గురించి ఓ స్వరూపం అతనెప్పుడూ సృష్టించుకోలేదు. ప్రయత్నించినా విఫలమయ్యేవాడు. చేతనయ్యేది కాదు. అతడామెను ఆరాధిస్తున్నాడు. ప్రేమకన్నా ఆరాధన గొప్పది. అంత ఆరాధించే వ్యక్తులను గురించి ఎవ్వరూ రూపకల్పన చేసుకోలేరు. ఇది సత్యం. ఓ రూపం లేని వ్యక్తితో, ఒట్టి మనసుతో మాట్లాడుతున్నాడు మధుబాబు. మనిషి ఎలా వున్నా అతనికి నిమిత్తం లేదు. అతని ఆనందానికి భంగం రాదు. పద్మజకు అర్ధమవుతుందా యీ విషయం? అతని హృదయాన్ని చదవగలుగుతుందా?

ఓ రోజు సాయంత్రం ఐదు గంటలయింది. హైదరాబాద్‌లో పద్మజ అప్పుడే ఇంటికి వచ్చి తలంటు పోసుకుంది. మనసంతా ఎంతో ఉల్లాసంగా వుంది. జుట్టు ఆరబెట్టుకుందామని డాబామీదకు వెళ్ళింది. సాయంకాలపు నీరెండలో దూరంగా మెరుస్తున్న చిన్ని కొండలూ, యీ కమ్మటిగాలీ, నీలాకాశపు నిర్మల సౌందర్యం ఆమె మనసు సంతోషంతో ఉరకలు వేసింది. ఈ పాటికి ఏం చేస్తుంటాడో మధుబాబు? శ్రద్ధగా పాఠాలు చదువుకుంటూ వుంటాడా? తన గురించి ఆలోచిస్తూ ఉంటాడా? అతనికి రాయాలనిపించింది అప్పటికప్పుడు. గబగబా క్రిందకు వెళ్ళి కాయితం కలం తెచ్చుకుని కుర్చీలో కూర్చుని రాయసాగింది.

మధూ!

ఎంత ప్రశాంతంగా వుంది ఇవాళ ఎన్ని ఊహలు? అతనో మహరాజు. నాకు అందదు. ఎత్తయిన సింహాసనం మీద కూర్చుని వున్నాడు. అతన్ని చేరుకుందామని మెట్లు ఎక్కుతున్నాను. తలవంచుకుని మరో ధ్యాసలేకుండా ఎక్కుతున్నాను. ఆయాసం వస్తోంది. ఎంతకూ అంతు తేలని ఈ ప్రయాణం. ముఖాన స్వేదబిందువులు అలుముకుంటున్నాయి. అతన్నెట్లా చేరుకుంటాను? అతనికి తెలుస్తుందనా తపన? మధూ! మధూ! జవాబు చెప్పవేం? అబ్బ మూడ్స్ చెదిరిపోతున్నాయి. ఇహ ఆపేస్తాను."

పద్మజ కన్నీరు కారుస్తోంది.

పద్మజకు ఓ  చిత్రమయిన కోరిక కలిగింది. రాబోయే వారం రాత్రి సరిగ్గా ఎనిమిది గంటలకు ఇద్దరూ ఒకర్ని గురించి ఒకరు ఆలోచించుకోవాలని. "మీరు ఆదివారం రాత్రి సరిగ్గా ఎనిమిది గంటలకు ఉత్తరం రాయండి. అప్పుడు నేను మీ గురించి ఆలోచిస్తూ వుంటాను" అని రాసింది.

తీరా ఆదివారం సాయంత్రం ఐదున్నరయేసరికి ఓ స్నేహితురాలు వొచ్చి సినిమాకు వెళదాం రమ్మని కూర్చుంది.

"అబ్బ ఇవాళ వద్దులేవే మనసేం బాగాలేదు. రేపెప్పుడైనా వెడదాం" అని పద్మజ తప్పించుకోజూసింది.

"అయినా ఏమిటీ మధ్య అదోరకంగా వుంటున్నావు? మునుపటిలోలాగ సరదాగా ఉత్సాహంగా వుండటంలేదు. పద పద,రాకపోతే ఎత్తుకు తీసుకు వెళతాను" అంటూ బలవంతంగా లాక్కెళ్ళిపోయింది స్నేహితురాలు.

సరిగ్గా అదేరోజు మధ్యాహ్నం మధుబాబు స్నేహితుడొకడు కలకత్తానుంచి వస్తున్నాడు. అతను విశాఖపట్నంలో దిగటంలేదు కాని మాట్లాడవలసిన విషయాలు చాలా వున్నాయనీ, స్టేషన్‌కి వచ్చి కలుసుకొమ్మని మధుబాబుకు ముందురోజు ఉత్తరం రాశాడు. ఇద్దరూ ఇంటర్మీడియట్‌లో క్లాసుమేట్స్, ఎంతో ఆత్మీయులు. మధుబాబు స్టేషన్‌కి వెళ్ళాడు.

ఆ మిత్రుడు కూడా సాహిత్య పిపాసి. ఇద్దరు లోకాన్ని మరచి కబుర్లలో పడ్డారు. ట్రెయిన్ కదలబోతోంది. మధుబాబుని సంభాషణ మధ్యలో వొదలటం ఇష్టంలేక "అరె కొంతదూరం రైల్లో రారా బాబూ? మరో ట్రెయిన్‌లో తిరిగి రావచ్చులే" అంటూ బలవంతంగా కంపార్టుమెంటులోకి ఎక్కించాడు.

తుని స్టేషను వచ్చేదాకా ఇద్దరూ కబుర్లలో మునిగి తేలారు. అప్పటికీ అతడ్ని విడిచి పెట్టాలంటే కష్టమనిపించింది. కాని తప్పదు. సెలవు తీసుకుని అక్కడ దిగిపోయాడు.

అప్పటికి సాయంత్రం ఐదయింది. ప్రొద్దుటినుంచీ భోజనం లేకపోవటం వలన బాగా ఆకలిగా వుంది. వెళ్ళి కాఫీ త్రాగి వచ్చాడు. విశాఖపట్నం పోవటానికి మళ్ళీ ఇప్పుడిప్పుడే ట్రెయిన్ లేదు. ఎనిమిది గంటలకల్లా అక్కడకు చేరుకోవాలి. పద్మకు ఉత్తరం రాయాలి. స్టేషన్ బయటకు వచ్చాడు ఆలోచిస్తూ. దూరంగా ఎక్కడినుంచో తిరిగి వస్తూ టాక్సి ఒకటి కనిపించింది. దాన్ని ఆపి అందులో కూర్చుని "విశాఖపట్నం, త్వరగా" అన్నాడు.

"ఎనిమిదికల్లా చేరుకుంటానా లేదా?" అని మనసు ఆరాటంతో కొట్టుకుపోతోంది. ఏమీలేదు ఊరికినే పిచ్చి.

సరిగ్గా ఏడూ యాభయ్యి ఐదు నిముషాలకల్లా గదికి చేరుకున్నాడు. చాలా ఆకలి వేస్తోంది. అతనికి నీరసంగా కూడా వుంది. బల్లమీద ఎవరో స్నేహితుడు పంపించిన పూతరేకులు ఉన్నాయి. ఒక చేతితో అవి తీసుకుని తింటూ ఉత్తరం రాయసాగాడు.

"మీరు హాయిగా భోజనం చేసి, తాంబూలం వేసుకుని సోఫాలో నన్నుగురించి ఆలోచిస్తూ వో చెయ్యి అలా గడ్డం క్రింద ఆనించి వయ్యారంగా పడుకున్నారు కాబోలు. నేనిలా ఆకలితో అమ్మాయిగారికి పూజ ప్రారంభించాను. అయోమయ గాఢాంధకార జీవితంలో వెలుగురేఖ మీరు. అలాంటి మిమ్మల్ని పూజించకుండా ఎలా వుండేది? అబ్బ. మన ఇద్దరి మధ్యా ఇన్ని వందల మైళ్ళదూరం. ఎలా భరించేది? అంతదూరాన మిమ్మల్ని? ఈ సాహిత్యం అబద్ధం. జీవితం, చదువూ,ప్రపంచం అంతా మిథ్య. మీరు ఒక్కరే నిజం. విమానంలో ఎగిరి వచ్చెయ్యనా మీ దగ్గరకు? ఎంత బాధ కలిగిస్తున్నారు మీరు నాకు. అసలు మీరు చేసేవన్నీ తప్పులే. మీకే శిక్ష విధించినా పాపంలేదు. మీ చెంపమీద అలా సున్నితంగా కొట్టాలని వుంది. మీరు చేసే నేరాలన్నీ రాసుకుంటున్నాలెండి. కలిపి అన్నిటికీ పెద్ద శిక్ష. పూతరేకులు తింటూ రాసిన ఈ ఉత్తరం తియ్యగా వుందో లేదో రాయండి –" మధు (తియ్యని కన్నీళ్ళతో.)

పద్మజ సినిమా చూస్తుందన్న మాటేగాని ధ్యాస అంతా విశాఖపట్నంలో వుంది. ఆ వంకెల జుట్టు అలా నుదుటిమీద పడుతూండగా, ఆ తెల్లటి అబ్బాయి అందంగా కుర్చీలో కూర్చుని తనకు రాస్తూవుంటాడు. పద్మా, పద్మా అని కలవరిస్తూ వుంటాడు. అతని కంఠం, రూపం అన్ని ఎంత మనోహరం. అబ్బ ఎంత మంచివాడు. ఎంత అందగాడు.

"ఒసేవ్ సినిమా చూస్తున్నావా లేదా?" అంటూ స్నేహితురాలు నెత్తిమీద ఒక్కటిచ్చుకుంది.

"నేనెవర్ని మీకు?"

"నా బంగారు తల్లివి."

"మీరెవరు?"

"వెలుగును వెదుక్కునే బాటసారిని."

"ఎక్కడకు ప్రయాణం?"

"కాంతి కిరణం కడకు."

"చేరుకుంటున్నారా?"

"అది యెప్పుడూ అందని, దూరంగా పోని అందమయిన ఆశారేఖ."

"నేనెవర్ని?"

"నా కంటిపాపవు."

"మీరెవరు?"

"అడవి మనిషిని."

"వొట్టి..."

"అవును. ఒట్టి అడవి మనిషిని."

"మీకేం కావాలి?

"తెలీదు. తెలీదు."

"మీరు ఎక్కడ వున్నారు?"

"చీకట్లో..."

"భయం వెయ్యదూ?"

"అబ్బ చాలా చాలా. ఒంటరిగా పడుకోవటం యెంత భయం?"

"నాకు నవ్వొస్తోంది."

"నా మంచితనం చూశా? నేను చాలా మంచివాడిని తెలుసా?"

"నేనెవర్ని?"

"ఒట్టి మొద్దువి."

"ఏయ్ నాకు కోపం వస్తుంది చెబుతున్నా."

"శిక్ష విధిస్తారా?"

"ఊ"

"ఏమిటి?"

"గుంజిళ్ళు."

"మీరెవరు?"

"భవదీయుడ్ని"

"అంటే?"

"ఎవరినన్నా అడగండి."

...........

"అర్థం తెలుసుకున్నా "భవదీయ" అంటే నేను మాత్రం మ దీయే బాబూ"

"కాదని నాకు తెలుసు."

"అలాగా ఎప్పట్నుంచండి ఈ అహంభావం?"

21

అతని పరీక్షలు జరిగాయి. ఒక వైపు పద్మజని గురించి హృదయం నింపుకుంటూనే ఓపిక చేసుకుని చదివాడు మధుబాబు. పేపర్లు బాగా రాశాడు.

అతను పరీక్ష పాసయ్యాడు.

ఓ పదిరోజులు సెలవులు వచ్చాయి. ఇంటికి వెళ్ళాడు. మళ్ళీ చిక్కిపోయాడని తల్లి గోల చేసింది. అక్కడున్నన్నాళ్ళూ మంచి ఆహారం తీసుకొమ్మని తండ్రి ఆదేశించాడు.

అతనికి పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి.

కోడల్ని తెచ్చుకోవాలని కోరిగ్గా వుంది సుందరమ్మగారికి. ఈ విషయాన్ని మధుబాబు ముందు ఎత్తింది. "అప్పుడే నాకు  పెళ్ళేమిటమ్మా?" అని అతను చికాకు పడ్డాడు.

"నాకు మాత్రం కోడల్ని చూసుకోవాలని లేదట్రా. మీ అబ్బాయికి పెళ్ళి చేస్తారా? అని ఎంతోమంది వచ్చి తిరిగి పోతున్నారు. అలా మన దగ్గరకు వస్తోంటే నిర్మొహమాటంగా చెప్పటం కూడా కష్టం. ఐనా ఇప్పుడు పెళ్ళి చేసుకుంటే నష్టమేముంది? కాపురానికి తీసుకురావాలని నిబంధన ఏమన్నా వుందా? పండగలకూ వాటికీ చక్కగా నువ్వు అత్తారింటికి వెళ్ళటం ,ఆ పిల్ల ఇక్కడకు వచ్చి ఇల్లంతా కలయ తిరగటం ఎంచక్కా వుంటుంది" అంది ఆవిడ ఆ దృశ్యాల్ని ఊహిస్తూ.

"ఈ సారి వేసవి సెలవులకి వచ్చినప్పుడు చూద్దాం లేమ్మా. ఇప్పుడు సెలవులు కూడా తక్కువ. అంటూ మధుబాబు తప్పించుకున్నాడు.

విశాఖపట్నం వచ్చి మూడో ఏడులో చేరాడు. హాస్పటల్‌కి దగ్గరగా మరోగది తీసుకున్నాడు. హాస్పటల్‌లో పేషెంట్సు, నర్సులు, తమ కాలేజీ అమ్మాయిలు.. యీ జీవితం కొంత కొత్తగా వుంది. ఇదివరకటిమాదిరిగాక ఇప్పుడు అమ్మాయిలకు మరింత చేరువగా సంచరించే అవసరం, అవకాశం రెండూ వున్నాయి. కాలేజీలో అమ్మాయిల్లో అందమైన వాళ్ళుకూడా వున్నారు కాని చూడని వాటిమీద మోజో, ఎదుటనున్న వారిమీద నిర్లక్ష్యమో అతనెప్పుడూ వీళ్ళని గురించి మరో రకంగా ఆలోచించనియ్యకుండా చేసేది పద్మజ, పద్మజ రూపం తెలియని పద్మజ. ఆమె గురించే నిరంతరం అతని తపన.

మొన్న తల్లి తన పెళ్ళి విషయం ఎత్తింది. తాను మరొకర్ని ఎలా పెళ్ళి చేసుకుంటాడు? ఒకప్పుడు రాజ్యలక్ష్మిని యీ ప్రపంచంలో అందరినీ ధిక్కరించి పెళ్ళి చేసుకోవటానికి సిద్ధపడ్డాడు. తన త్యాగం భరించలేక ఆమె యీ లోకాన్ని త్యజించి వెళ్ళిపోయింది. ఆ పాపం తనదేనేమో. అది ఎన్నటికి ఆరని మంట. పద్మజ పరిచయంలో, ఆ అనురక్తిలో శీతల వాయువులు వీస్తున్నాయి. ఆమెను విడిచి తాను ఎలా వుండగలడు? ఆమె తనకి కావాలి. పద్మజలాంటి వ్యక్తులు కోటికి ఒకరు కూడా వుండరు. తాను ఆమెనే వివాహం చేసుకోవాలి.

ఆమె ఎవరో, కుటుంబం ఏమిటో ఏం చదువుతోందో, ఏం చేస్తుందో తెలియదు. అయినా ఆమె తనకు కావాలి. ఆమె లేని జీవితాన్ని ఊహించలేడు. తను పద్మజ కోసం. ఈ విషయం ఆమెకెలా చెప్పటం? యెన్నో విషయాలు రాసుకుంటారు. పెళ్ళి విషయం ఎత్తబోయేసరికి సంకోచం అడ్డువస్తోంది. తనని అపార్థం చేసుకుంటుందేమో? తప్పేముంది ఇందులో, అతను వాయిదాలు వేసుకుంటూ పోసాగాడు.

Post your comments

(కొనసాగింపు వచ్చే నెలలో)